క్లుప్తంగా

విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో 100 మంది ఏపీఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం కల్పించారు. ఆదివారం కాకాని వెంకటరత్నం 125వ జయంతి ఘనంగా నిర్వహించారు. కాకాని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాని మనువడు కాకాని తరుణ్ విద్యార్థులకు గ్రంథాలయంలో శాశ్వత సభ్యత్వం బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయానికి వచ్చి చదువుకునేందుకు వీలుగా సభ్యత్వం కల్పించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం బహూకరించిన కాకాని తరుణ్‌ను గ్రంథాలయాధికారి రమాదేవి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

తరిమెల నాగిరెడ్డికి నివాళి




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మార్క్సిస్టు – లెనినిస్టు మేధావి, విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతి సభ జరిగింది. సభలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ భారత సామాజిక, ఆర్థిక పరిస్థితులను 50 ఏళ్ల క్రితమే తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' గ్రంథంలో విశ్లేషించారన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజలను సమీకరించడం, విప్లకారులను ఐక్యం చేసే లక్ష్యంతో అహోరాత్రులు కృషి చేశారని వివరించారు. ఎమర్జెన్సీ కాలంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అమరులయ్యారని తెలిపారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించడమే తరిమెల నాగిరెడ్డికి ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. సభలో సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి యు. వీరబాబు, మరీదు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11కేవీ జీఎస్ రాజు రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్‌రాజు రోడ్డు, ఒరుగువారి వీధి, దాట్ల బ్రహ్మరాజు వీధి, దేవాలయం వీధి, సుబ్బరాజు వీధి, బెజ్జంవారి వీధి, ముత్యాలంపాడు శివాలయం, గొట్టిముక్కల సూర్యనారాయణరాజు వీఎంసీ స్కూల్, పశుసంవర్ధక శాఖ కార్యాలయం, ప్రభుత్వ ముద్రణాలయం, అంబేడ్కర్ నగర్, చల్లపల్లివారి వీధి, రాణాప్రతాప్ రోడ్డు, కొమ్మువారి వీధి, బ్రహ్మయ్యపంతులు వీధి, సుమానంవారి వీధి, అమలి స్కూల్, మారుతి వ్యాయామశాల, భగత్‌సింగ్ రోడ్డు, జనార్దనరావు వీధి, పాపరాజు వీధి, కనకరాజు వీధి, కావూరువారి వీధి, నర్రావారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థి దశ నుంచి పరిసరాల పరిశుభ్రతను అలవర్చుకోవాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.జగదీశ్వరి సూచించారు. ఆదివారం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానంలో భాగంగా 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని వీధులను శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తవని చెప్పారు. దోమలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.చంద్రశేఖర్, వలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవపై శ్రద్ధ ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరికీ సమాజ సేవ పట్ల శ్రద్ధ ఉండాలని వేముల హజరత్తయ్య గుప్తా సూచించారు. సత్యనారాయణపురం, కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ జిల్లా 203 క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైశ్య జాతి ఖ్యాతిని ఇనుమడింప చేయడానికి వేముల హజరత్తయ్య గుప్తా రచించిన ప్రతిజ్ఞ దోహదపడుతుందని వాసవీక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఎరుకుల రామకృష్ణ పేర్కొన్నారు. అనంతరం సమాజంలో ప్రజాహితంగా సాగుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. హరిప్రసాద్, ఆదిశేషు, ప్రసాద్, సత్యప్రసాద్, శ్రీనివాస్, సముద్రాల, సత్యనారాయణ, మానస, కల్పన, సురేష్‌కుమార్, కేశవ, సురేఖ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

జలం.. గరళం

- తుప్పుపట్టిన పైప్‌లైన్‌లు
- కుళాయిల్లో కలుషిత నీరు
- సింగ్‌నగర్‌లో అరకొరగా తాగునీటి సరఫరా



రైల్వేట్రాక్ రోడ్డులో పైప్‌లైన్‌ల లీకులతో వృథాగా పోతున్న తాగునీరు



కుళాయిల నుంచి రంగుమారి వచ్చిన తాగునీరు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): తాగునీటి ఎద్దడితో సింగ్‌నగర్ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల కొద్దీ కుళాయిల వద్ద పడిగాపులు పడినా బిందెడు నీరు కూడా అందడం లేదు. తాగునీటి కోసం తెల్లవారుజాము నుంచి కుళాయిల వద్ద పడిగాపులు పడుతున్నా తీరా అరకొరగా వచ్చే నీరు రెండు, మూడు బిందెలకు మించకపోవడంతో వాటితోనే సర్దుకుపోవాల్సి వస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

అడుగడుగునా లీకులు

తాగునీటి కోసం కుళాయి తిప్పితే రంగు మారిన నీరు, కలుషితమై దుర్గంధంతో వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత సమయం ఆగి పట్టుకుందామన్నా నీరు అరగంటకు మించి రావడం లేదు. ఈ ప్రాంతంలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌లు తుప్పుపట్టి అడుగడుగునా లీకులు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం తాగునీరు కలుషితమై మురుగుతో కలసిపోయి రంగు మారి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దుర్గధంబరితంగా వస్తున్న ఈ నీటిని తాగి రోగాల పాలవుతున్నామని వాపోతున్నారు. పైప్‌లైన్‌ల లీకులతో వందల లీటర్ల తాగునీరు వృధాగా పోవడమే కాకుండా కలుషితం అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

ప్రతి ఏటా ఇంటి పన్ను, నీటి, డ్రైయినేజీ పన్నులు ముక్కుపిండి వసూళ్లు చేసే నగరపాలకసంస్థ అధికారులు తాగునీటి సరఫరాను మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. కుళాయిల ద్వారా మురుగు నీరు వస్తోందని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా వారు స్పందించడం లేదు. పైప్‌లైన్‌లు మార్చకపోతే తాము మాత్రం ఏమి చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్‌లలో వచ్చే రంగు మారిన నీళ్లు తాగడానికే కాకుండా ఇతర అవసరాలకు కూడా పనికి రాకుండా ఉంటున్నాయని వాపోతున్నారు. కలుషితమైన నీటిని వంటలకు, ఇంట్లో వాడుకోవాల్సి వస్తుందని, దీంతో రోగాలబారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయాలు ఖర్చుచేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కారించాలని వారు కోరుతున్నారు.

గురువు భగవంతుడితో సమానం



ప్రభుత్వ ఉపాధ్యాయులను సత్కరించిన భారత్ వికాస్ పరిషత్ సభ్యులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిర్ ప్రాంగణంలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ విజయవాడ శాఖ ఆధ్వర్యాన 'గురువందన – ఛాత్రాభినందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటూరులోని హిందూ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి పీవీ రాములు పాల్గొని ప్రసంగించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు కృతజ్ఞతలు తెలిపేదే గురువందన కార్యక్రమం అని అన్నారు. మనకు జ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని నేర్పించే గురువు భగవంతుడితో సమానంగా చూసుకుంటామన్నారు. గురువు లేకుండా విద్య లేదని.. విద్య లేని జీవితం వెలుగు లేనిదవుతుందన్నారు. గురువును గౌరవించుకోవడం మన కర్తవ్యమని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ చైర్మన్ తెలప్రోలు వీరయ్యగుప్త, కన్వీనర్‌గా చిలకల నాగేశ్వరరావు, అధ్యక్షుడు చెందోలు ఆంజనేయులు, కదం కృష్ణమూర్తి, చుండురి మురళీధర్, ఎస్.ఎస్.వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాఖాభేదాలు విస్మరించి వివాహాలు నిశ్చయం చేసుకోవాలి

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బలరామకృష్ణమూర్తి



మాట్లాడుతున్న కొప్పరపు బలరామకృష్ణమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాఖాభేదాలు విస్మరించి తమ పిల్లల వివాహాలు నిశ్చయం చేసుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి తల్లిదండ్రులకు సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణపురంలోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో 45వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు సకాలంలో తమ పిల్లలకు వివాహం జరిగేలా చూడాలన్నారు. ఉన్నతమైన, ఆదర్శవంతమైన విలువలతో త్వరితగతిన వివాహాలు చేసుకోడానికి బ్రాహ్మణ సేవా సంఘం పూర్తి తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. ఈ వేదికలో 400 దరఖాస్తులు రాగా వాటిలో 10 సంబంధాలు పరస్పర అనుకూలంగా స్పందన తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి తణుకు రామకృష్ణ, కోశాధికారి పెద్దిభొట్ల కాశీ విశ్వనాథం, మల్లాది ఆంజనేయశర్మ, గరికపాటి కోటేశ్వరశర్మ, సుందరి, వరప్రసాద్, పింగళి వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

పత్తి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి

రెండు రోజుల అవగాహన సదస్సులో నిపుణులు



సదస్సులో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పత్తిగింజలలో పోషక విలువలు, నూనె తయారీ పరిశ్రమలో శాస్త్రీయ దృష్టి అవసరం వంటి అంశాలపై పలువురు నిపుణులు చర్చించారు. విజయవాడలో భారత్ సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ సంఘం, ఆల్ ఇండియా కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్ సంయుక్తంగా రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా వంట నూనె భద్రత, పశుపోషకాహారం, గ్రామీణ అభివృద్ధి, పరిశోధనలో కొత్త మార్గాలపై చర్చించారు. పత్తిగింజకు ప్రాణం పోసి-నూనె తదితర వినియోగాల్లో అభివృద్ధి మార్గాలు అనే అంశంపై సాగిన సదస్సులో 60 మందికిపైగా నిపుణులు ప్రసంగించారు. పత్తిసాగు నుంచి వంటనూనె, మేశ్ తయారీ, మార్కెట్ అభివృద్ధి, బ్రాండింగ్, పరిశోధన, విధానాలు, వృద్ధి అంశాలపై చర్చలు జరిగాయి. గుజరాత్‌లో వినియోగం విస్తరణ విజయవంతంగా సాగుతున్న నేపథ్యంలో, దక్షిణ భారతదేశంలో ప్రజలలో అవగాహన పెంచేందుకు బ్రాండింగ్, డిజిటల్ ప్రచారం, విశ్వసనీయ కథనాలు, ప్రేరణాత్మక ప్రచారానికి పెద్దపీట వేయాలని నిర్ణయించారు. విద్యార్థుల విభాగంలో హైదరాబాద్‌లోని సీఎస్ఐటీ-ఐఐసీటీకి చెందిన రౌషన్ రాజ్ సిన్హా, ముంబయికి చెందిన అలియా సలీం షేక్, డాక్టర్ అమిత్ పార్థప్ తదితరులు ఉత్తమ విశ్లేషణలతో బహుమతులు పొందారు. నిర్వాహక సంస్థల ప్రతినిధులు నీలేష్ పటేల్, అంగ్ష మాలిక్, సందీప్ బజోరియా తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీలో నేడు పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. కార్యక్రమాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరిచుకోవాలని కమిషనర్ సూచించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



హెల్పింగ్ టుగెదర్ 2009 ట్రస్ట్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్‌క్లబ్, హెల్పింగ్ టుగెదర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ ఇమ్మానేని కృష్ణప్రసాద్, గుర్రం ఏడుకొండలు ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్కే షఫీవుల్లా, సభ్యులు చంద్రమౌళి, దుర్గాప్రసాద్, శివకుమార్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అమరావతి వాకర్స్‌క్లబ్‌లో..

దుర్గాపురం అమరావతి వాకర్స్‌క్లబ్‌లోనూ స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. వాకర్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ కేక్ కట్‌చేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డెప్యూటీ గవర్నర్‌లు కృష్ణప్రసాద్, బీ వసంతకుమార్, కే రాము, వెంకటేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

దుష్టపాలనను తరిమికొట్టాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



దేవీనగర్‌లో క్యూఆర్ కోడ్ పోస్టర్‌లతో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ జానారెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చంద్రబాబు దుష్టపాలనను తరిమికొట్టాలని.. కూటమి ప్రభుత్వ మోసాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. దేవీనగర్‌లో ఆదివారం స్థానిక కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి అధ్యక్షతన రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితం అయ్యిందని, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదలివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాలను అమలు చేయడంతో పాటు అంతకు మించి సూపర్ సిక్స్ అమలు చేస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా అమలు చేయడం లేదన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండానే అమలు చేస్తున్నామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 30వ డివిజన్‌లో ఐదేళ్లలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయడంతో పాటు డీబీటీ ద్వారా 18,548 మందికి రూ.55.50 కోట్లు సంక్షేమం అందజేశామని తెలిపారు. తాము అభివృద్ధి, సంక్షేమాన్ని కోవిడ్ సమయంలో సైతం పరుగులు పెట్టించామని గుర్తుచేశారు.

పేదలపై విద్యుత్ చార్జీల భారం

విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఛార్జీలు పెంచి పేద ప్రజలపై మోయలేని భారం వేశారని మల్లాది విష్ణు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో విద్యుత్ బిల్లులను చెల్లించడానికి పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. పేదల కడుపుకొట్టి పెద్దలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బోగాధి మురళి, దుర్గారావు, పేరం త్రివేణిరెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మట్టిమనిషి నాటక ప్రదర్శన



విజయవాడ కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం, జాషువా కళావేదిక, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, ఫొటో ఇండియా సహకారంతో మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ బృందం రెండు రోజులపాటు ప్రదర్శించిన 'మట్టిమనిషి' నాటకం ప్రదర్శన ఆదివారం ముగిసింది. వాసిరెడ్డి సీతాదేవి రచించిన మట్టిమనిషి నవలకు నాటకీరణ అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, దర్శకత్వం ఎస్ఎమ్ భాషా. రైతు జీవితానికి అద్దం పట్టిన నాటక ప్రదర్శనలో 50 మంది నటీనటులు పాల్గొన్నారు. మూడు గంటలపాటు ప్రదర్శింపబడిన ఈ నాటకంలో ప్రతీ సన్నివేశం నటీనటుల ప్రతిభకు అద్దం పట్టింది. కార్యక్రమంలో అరసం బాధ్యులు పరుచూరి అజయ్ కుమార్, అరణ్ కుమార్, గోళ్ళ నారాయణరావు, టీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక ప్రకాష్‌నగర్ అన్నెంవారి వీధిలో పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఎస్. నాగేశ్వరరావు కథనం ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం అన్నెంవారి వీధిలోని షేక్ సాయిబాబు ఇంట్లో పేకాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 78వేలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం



63వ డివిజన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు, పార్టీ శ్రేణులు

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. స్థానిక 61వ డివిజన్ వాంబేకాలనీ, హెచ్ బ్లాక్‌లో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. మల్లాది విష్ణు మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలో డివిజన్ ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు. వాంబేకాలనీ, ఆర్ఆర్‌పేటలో 25వేల మందికి ఇళ్లపట్టాలను రిజిస్ట్రేషన్ చేయించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ అధికారం చేపట్టేందుకు అలివి కాని హామీలను ఇచ్చి ప్రజలను ఏ విధంగా మోసం చేశారో పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ నాలం బాబు, పార్టీ రాష్ట్ర మహిళ కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి, వలంటీర్ వింగ్ అధ్యక్షుడు ఆర్ఎస్ నాయుడు, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు మాతా మహేష్, విద్యార్థి విభాగం నాయకుడు నాగిరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మీసాల సత్యనారాయణ, సోషల్ మీడియా రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరవల్లి ఆచారి, అవుటుపల్లి నాగరాజు, వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో..

స్థానిక 63వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ మోసం – గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని దించడానికి ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని ఎన్నికల ముందు విష ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అబద్దాలు, అసత్యాలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి, 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, మాజీ కార్పొరేటర్ వీర్ల వరలక్ష్మి, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయ్, మాతా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవచన చక్రవర్తి 'మల్లాది'



మల్లాది శత జయంతి సభలో ఆంజనేయ ఘనాపాటి, ఆచార్య రఘునాథశర్మ తదితరులు

విజయవాడ కల్చరల్: మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రవచన చక్రవర్తి అని చింతలపల్లి ఆంజనేయ ఘనాపాటి పేర్కొన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీతీర్థ స్వామి ఆశీస్సులతో శివరామకృష్ణ క్షేత్రం ఆధ్వర్యాన ప్రవచన రంగంలో తనదైన ముద్ర వేసుకున్న మల్లాది చంద్రశేఖర శాస్త్రి శత జయంతి సభను గాంధీనగర్‌లోని రామకోటిలో ఆదివారం నిర్వహించారు. ఆంజనేయ ఘనాపాటి మాట్లాడుతూ భగవంతుని వాక్కు సరళమైన భాషలో వివరించడానికి మల్లాది అవతరించినట్లు తెలిపారు. ఆచార్య శలాక రఘునాథ శర్మ మాట్లాడుతూ నాడు సామాజిక మాధ్యమాలు లేని సమయంలో ఆకాశవాణి ద్వారా తన వాక్కును వినిపించిన మహనీయుడు మల్లాది అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరీ పీఠం మల్లాదిలోని ప్రతిభను గుర్తించి వారిని ఆస్థాన పండితులుగా నియమించినట్లు తెలిపారు. సంస్కృత పండితులు విశ్వనాథ గోపాల కృష్ణశాస్త్రి, తంగిరాల రాజేంద్రప్రసాద్, శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతిరాయ్ హెచ్చరించారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం ఆమె కౌన్సెలింగ్ నిర్వహించారు. క్షణికావేశం వల్ల చేసే పనుల వల్ల జీవితం అంధకారంగా మారుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎటువంటి నేరాలకు పాల్పడకుండా నేరప్రవృత్తిని మాని సత్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. స్టేషన్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులకు ఆత్మీయ సత్కారం

విజయవాడ కల్చరల్: మిలీనియం కళాభారతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం వివిధ రంగాలకు చెందిన కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ స్నేహానికి జాతి, కులమత, ప్రాంతీయ బేధాలు లేవన్నారు. కుంచం మోహనరావు ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన డేవిడ్‌రాజు, చిట్టిబాబు, కే రాజు, మాడుగుల రామకృష్ణ, డాక్టర్ యూవీ రత్నం, కేఎస్ఆర్ దాసులను సత్కరించారు.